సాక్షి విశాఖపట్నం

శుక్రవారం ౹ 2 ౹ ఫిబ్రవరి ౹ 2024



మార్చి 9న లోక్ అదాలత్

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. IIలో



పరీక్షా సమయం

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహించనున్నారు. IIలో



పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. IIలో




నేటి నుంచే క్రికెట్ పండగ

- భారత్ – ఇంగ్లండ్ రెండో టెస్ట్‌కు అంతా సిద్ధం
- విజయమే లక్ష్యంగా నెట్స్‌లో శ్రమించిన టీమిండియా
- భారీ భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు

IIలో



న్యూస్‌రీల్

18 మందికి ట్యాక్స్ కలెక్టర్లుగా పదోన్నతి



నియామక పత్రాలు అందజేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని 18 మంది ఆఫీస్ సబార్డినేటర్లు, పీహెచ్ వర్కర్లు, నాన్ పీహెచ్ వర్కర్లకు ట్యాక్స్ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో గురువారం వారికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతి పొందిన వారు బాధ్యతగా విధులు నిర్వర్తించి, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. జీవీఎంసీ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ పద్మజ, పర్యవేక్షకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐవోగా మురళీధర్ బాధ్యతల స్వీకరణ



మురళీధర్‌ను అభినందిస్తున్న డీవీఈవో రాధ, సూపరింటెండెంట్ గణేష్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో)గా పి.మురళీధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్ఐవోగా పనిచేసిన రాయల సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయటంతో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న మురళీధర్‌కు ఆర్ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విధుల్లో చేరిన ఆయనకు పూర్వ ఆర్ఐవో సత్యనారాయణ పూర్తి బాధ్యతలను అప్పగించారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ, కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, సిబ్బంది మురళీధర్‌కు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి, ఆహ్వానించారు.

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: డయల్ యువర్ సీపీకి వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీపీ తన చాంబర్ నుంచి నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 8 మంది కాలర్స్ ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. సీపీ రవిశంకర్ ప్రతి ఒక్క కాలర్ సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వెంటనే ఆ ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. గత నెల 18వ తేదీన నిర్వహించిన డయల్ యువర్ సీపీకి వచ్చిన 31 ఫిర్యాదుల్లో 15 పరిష్కరించారు. ఒకటి సివిల్ పరిధిలో ఉండడంతో కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. మిగిలిన 15 పరిష్కార దశలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్లకు జోన్లు కేటాయింపు

దాబాగార్డెన్స్: బదిలీల్లో భాగంగా జీవీఎంసీకి వచ్చిన మున్సిపల్ కమిషనర్లకు జోన్లు కేటాయించారు. జోన్–2 కమిషనర్‌గా కనకమహాలక్ష్మి స్థానంలో యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ డి.లక్ష్మిని జోనల్ కమిషనర్‌గా నియమించారు. కనకమహాలక్ష్మి ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమితులయ్యారు. జోన్–4 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్థానంలో యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.సన్యాసినాయుడును నియమించారు. శివప్రసాద్ ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. జోన్–6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ కాగా.. ఆ స్థానంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును నియమించారు. జోన్–8 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా బదిలీ కాగా.. ఆ స్థానంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శి హేమావతిని నియమించారు. ఈ మేరకు వారికి జోన్లు కేటాయిస్తూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆశ.. నిరాశ



- కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండిచేయి
- టైర్–2 సిటీల కేటగిరీలో పెరగనున్న విమాన సర్వీసులు
- వందేభారత్ బోగీల సంఖ్య పెరిగే ఛాన్స్

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర బడ్జెట్ అంటే ఎన్నో ఆశలను రేకెత్తిస్తుంది. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఉత్కంఠ రేపుతుంది. బడ్జెట్‌లో తమకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయోనని అంతా ఎదురు చూస్తుంటారు. పైగా ఎన్నికల ముందు బడ్జెట్‌పై మరింత ఆసక్తిగా ఉంటారు. కానీ గురువారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ విశాఖ వాసులను నిరాశ పరిచింది. ఇతమిద్ధంగా ఎలాంటి కేటాయింపులు లేకుండా సాగింది. ప్రధానంగా రైల్వే జోన్‌పై గాని, విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి గాని ఊరటనిచ్చే ప్రకటన చేయలేదు. రైల్వే జోన్‌పై డీపీఆర్ సిద్ధమైందన్న సమాచారం తప్ప ఇతరత్రా స్పష్టత కొరవడింది. కొన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నానికి వ్యతిరేకంగా ఉద్యమాలు, ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ మొత్తాన్ని గతేడాదికంటే పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీంతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ఆందోళనకు ఫుల్‌స్టాప్ పడలేదు. దీనిపై ఈ బడ్జెట్‌లో ఏదైనా సానుకూల నిర్ణయం వెలువడుతుందన్న ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు నిధుల కేటాయింపును కూడా విస్మరించడం ఈ ప్రాంత వాసులకు విస్మయానికి గురిచేసింది.

ఇంకా విశాఖ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు గురించిన ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేదు. విశాఖలో అభివృద్ధి, ఉపాధికి దోహదం చేసే కొత్తగా సంస్థల ఏర్పాటు జోలికీ వెళ్లలేదు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ మెజార్టీ వర్గాలను నిరాశకు గురి చేసింది.

గుడ్డిలో మెల్లలా..

దేశంలోని టైర్–2,3 నగరాలకు ఉడాన్ పథకం కింద కొత్త విమాన సర్వీసులను పెంచాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా విమానయాన సంస్థలు కొత్తగా వెయ్యి విమానాల కొనుగోళ్లకు ఆర్డరిచ్చాయి. దీంతో విశాఖ విమానాశ్రయానికి మరికొన్ని విమాన సర్వీసులు పెరిగే అవకాశం ఉంది. బడ్జెట్‌లో పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు చేసిన ప్రకటన ఈ రంగంలో అలరారుతున్న విశాఖకు ఒకింత ప్రయోజనం చేకూర్చే అంశంగా కనిపిస్తోంది. ఇక దేశవ్యాప్తంగా 40 వేల వందేభారత్ బోగీలను ప్రవేశపెడ్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఫలితంగా విశాఖ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు ఈ ఆధునిక సదుపాయాలున్న బోగీలు అమర్చే అవకాశం కలుగుతుంది. గుడ్డిలో మెల్లలా అంతకు మించి ఈ బడ్జెట్‌లో విశాఖకు ఒనగూరిన ప్రయోజనాలు కనిపించక పోవడం విశేషం! కాగా విశాఖకు మొండి చేయి చూపించినప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఆస్కారం ఉందన్న అభిప్రాయాన్ని కొన్ని వర్గాల ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు రంగానికి ఊతం



కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.11.11 లక్షల కోట్ల కేటాయింపు, పీఎంఏవై కింద రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం, మూడు రైల్వే కారిడార్లు, ఉడాన్ స్కీంలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం వంటి వాటి వల్ల ఉక్కు వినియోగం బాగా పెరుగుతుంది. ఇది ఉక్కు రంగానికి ఊతాన్నిస్తుంది. ఈ అవసరాలను తీర్చడంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా పాలుపంచుకుంటుందన్న నమ్మకం ఉంది.

– **అతుల్ భట్**, సీఎండీ, ఆర్ఐఎన్ఎల్.

విశాఖకు, రాష్ట్రానికి అన్యాయం



ఈ బడ్జెట్‌లో విశాఖకు, రాష్ట్రానికి అన్యాయం జరిగింది. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించడంపై హామీ లేకపోవడం దుర్మార్గం. బడ్జెట్‌లో 99 శాతం మందికి ఎలాంటి ఉపశమనం లేదు. కార్పొరేట్లకే తప్ప పేద, మధ్య తరగతి వారికి ప్రయోజనం లేదు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అనడంలో సందేహం లేదు.

– **ఎం.జగ్గునాయుడు**, సీపీఐ(ఎం) విశాఖ జిల్లా కార్యదర్శి

ఐటీకి దీర్ఘకాలికంగా మేలు



ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఐటీ రంగానికి దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చనుంది. రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌తో ఇన్నోవేషన్‌కు ప్రోత్సాహం లభిస్తుంది. తద్వారా కొత్త కొత్త అన్వేషణలకు ఆస్కారం ఉంటుంది. స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమలూ ఏర్పాటై, ఉద్యోగావకాశాలూ పెరుగుతాయి. తలసరి ఆదాయం మెరుగవుతుంది.

– **బి.మురళీమనోహర్‌రావు**, సీఈవో, సాంఖ్య టెక్నాలజీస్

అభివృద్ధి, ఉపాధికి ఆస్కారం



కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు కేటాయింపులు లేకపోయినా, దేశంలోని వివిధ రంగాలకు మేలు చేసేదిగా ఉంది. మౌలిక వసతుల రంగానికి భారీగా నిధులు కేటాయించడం వల్ల రైల్వే, విమానయాన, పోర్టు తదితర రంగాల్లో పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. పర్యాటకరంగ అభివృద్ధికి, సాంకేతిక రంగంలో ప్రైవేటు సంస్థల ఆర్‌అండ్‌డీకి వడ్డీ లేని రుణాలివ్వడం మంచి పరిణామం.

– **ఓ.నరేష్‌కుమార్**, ప్రెసిడెంట్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

సమతూకం లేని బడ్జెట్



బడ్జెట్ సమతూకం లేని సంబరంగా మిగిలింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆశల పల్లకిలో ఊరించి మధ్య తరగతి వర్గాలకు మాత్రం అత్తెసరు భాగ్యాన్నే ప్రసాదించింది. వ్యవసాయానికి ఒకకొత్త దారి అవసరమని ఆర్థిక సర్వేలు చెబుతున్నా పట్టించుకోలేదు. మహిళ సాధికారత ఊసేలేదు. ముఖ్యంగా రాష్ట్రానికి మొండి చెయ్యి చూపింది. రైల్వే జోన్, విభజన హామీలను విస్మరించింది. ప్రత్యేక హోదా ఊసేలేదు. రెవెన్యూ లోటుకు సంబంధించి నిధుల విషయం ప్రస్తావన లేదు. భోగాపురం ఎయిర్‌పోర్టును విస్మరించింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఏ విధమైన కేటాయింపులు లేవు.

– **డాక్టర్ జాన్‌వెస్లీ**, స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్

ఆమోదయోగ్య బడ్జెట్!

సీఐఐ ప్రతినిధుల ప్రశంస



మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని సీఐఐ ప్రతినిధులు ప్రశంసించారు. బడ్జెట్ తీరుతెన్నులపై గురువారం ఓ హోటల్‌లో వీరు సమావేశమై చర్చించారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ 9–14 ఏళ్ల మధ్య వయసున్న బాలికలకు ఉచితంగా వ్యాక్సినేషన్ వేయాలన్న నిర్ణయం వల్ల మహిళల్లో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు ఆరోగ్య బీమా కవరేజిని పెంచడం, మరిన్ని వైద్య కళాశాలల ఏర్పాటు మంచి పరిణామమన్నారు. సీఐఐ విశాఖ వైస్ చైర్మన్ గ్రంధి రాజేష్ మాట్లాడుతూ మూడు ఆర్థిక రైల్వే కారిడార్ల ఏర్పాటుతో వ్యూహాత్మక పెట్టుబడులు, పోర్టు కనెక్టివిటీ, లాజిస్టిక్ సామర్థ్యం పెంపుతో పాటు రవాణా వ్యయం తగ్గడానికి దోహదపడుతుందని చెప్పారు. ఆర్‌అండ్‌డీ కార్పస్ ఫండ్‌పై దృష్టి సారించడం ద్వారా ఎంఎస్ఎంఈలకు ఊతమిస్తూ ప్రైవేటు రంగంలో ఆవిష్కరణలను పెంచుతుందన్నారు. రుజుల్ కెమికల్స్ లిమిటెడ్ డైరెక్టర్ ఆర్వీఎస్ రుద్రరాజు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేయడంతో పాటు ప్రైవేటురంగాలకు తక్కువ వడ్డీకి దీర్ఘకాలిక రుణాలు లభించే నిర్ణయం అభినందనీయమన్నారు. వ్యవసాయరంగానికి మేలు చేసేలా బడ్జెట్‌ను రూపొందించారని, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సృష్టించారని విజయనగర్ బయోటెక్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ తిరుపతిరాజు పేర్కొన్నారు. ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ డీకే మొహంతి మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.11.1 లక్షల కోట్లను కేటాయించడం మంచి పరిణామమన్నారు. సుభద్ర ఇంజినీరింగ్ లిమిటెడ్ ఎండీ లీలాప్రసాద్, సాంఖ్య టెక్నాలజీస్ సీఈవో మురళీమనోహర్‌రావు పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టు ఊసే లేదు



- ఈసారీ వాల్తేరు డివిజన్‌కు అంతంత మాత్రమే కేటాయింపులు
- దువ్వాడ–ఉత్తర సింహాచలం మధ్య 3, 4వ లైన్ల నిర్మాణానికి రూ.55 కోట్లు
- విశాఖ రైల్వే జోన్‌కు రూ.9 కోట్లు

సాక్షి, విశాఖపట్నం : పద్దు వస్తోంది.. ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని ఎదురు చూసిన ప్రతిసారీ.. ఎక్కాల్సిన రైలు జీవిత కాలం లేటు అన్నట్లుగానే మారింది వాల్తేరు డివిజన్ పరిస్థితి. ఉన్న ప్రాజెక్టులకు విదిలింపులు కూడా అంతంత మాత్రంగానే చేస్తూ.. కొత్త ప్రాజెక్టుల గురించి కనీస ప్రస్తావన లేకుండానే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ రైల్వే స్టేషన్‌కు ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. కొత్తగా రాయగడ డివిజన్ ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ నిర్మాణానికి రూ.9 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి మమా.. అనిపించేశారు. వాల్తేరు డివిజన్ పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్లు, లైన్ల మధ్యలో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన పేర్లు బడ్జెట్ ప్రతిలో కనబడుతున్నా.. కేటాయింపులు మాత్రం భూతద్దంలో వెతికేలా ఉన్నాయి.

- రూ.154.28 కోట్ల వ్యయంతో వడ్లపూడి గేట్ జంక్షన్ నుంచి టై లైన్‌గా గంగవరం పోర్టు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు మొత్తం 12.04 కి.మీ 3వ, 4వ లైన్ నిర్మాణానికి గాను ఈ బడ్జెట్‌లో రూ.79.58 కోట్లు కేటాయింపులు చేశారు.
- విశాఖపట్నం–గోపాలపట్నం మధ్య 15.31 కి.మీ మేర 3వ, 4వ లైన్ల నిర్మాణానికి 159.47 కోట్లతో ప్రతిపాదనలు చేయగా ఈ బడ్జెట్‌లో రూ.55.23 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.
- పలాస–విశాఖపట్నం–దువ్వాడ మధ్య 72, 27 కి.మీ మేర బీ–రూట్ నిర్మాణానికి రూ.50 లక్షలు
- విశాఖపట్నం రైల్వే వర్క్‌షాప్‌లో కవర్డ్ షెడ్స్ విస్తరణ, మౌలిక సదుపాయాలకు రూ.11 లక్షలు
- వాల్తేరు రైల్వే స్టేషన్ పరిధిలోని పుచ్చలదిబ్బ కాలనీ రైల్వే క్వార్టర్ల అభివృద్ధికి రూ.5 లక్షలు
- దువ్వాడ–ఉత్తర సింహాచలం మధ్య రూ.302.25 కోట్లతో 3వ, 4వ లైన్ నిర్మాణానికి గాను ఈ బడ్జెట్‌లో రూ.117.18 కోట్లు కేటాయింపులు చేశారు.
- ఉత్తర సింహాచలం–గోపాలపట్నం మధ్య 2.07 కి.మీ మేర బైపాస్ లైన్ డబ్లింగ్ పనులకు రూ.వెయ్యి మాత్రమే కేటాయించారు.
- ఉత్తర సింహాచలం డబ్లింగ్ పనులకు రూ.38 కోట్లు కేటాయించారు.
- పెందుర్తి– ఉత్తర సింహాచలం మధ్య సర్ఫేస్ క్రాసింగ్‌ని తప్పించేందుకు రూ.183.65 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనలుండగా ఈ బడ్జెట్‌లో రూ.10.63 కోట్లు కేటాయించారు.

80.75 శాతం పింఛన్ల పంపిణీ



12వ వార్డు నెహ్రూనగర్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీరు, సచివాలయం కన్వీనర్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లీలా కుమారి



71వ వార్డులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

మహారాణిపేట: జిల్లాలో తొలిరోజు 80.75శాతం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ పూర్తయింది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగర పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. బుధవారం బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసి.. గురువారం బయోమెట్రిక్ గుర్తింపు ద్వారా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. జిల్లాలో మొత్తం 1,66,564 మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. వీరి కోసం రూ.50.29 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. తుది సమాచారం ప్రకారం జిల్లాలో 1,34,497 మంది(80.75 శాతం)కి రూ.40.37 కోట్లను పంపిణీ చేశారు. ఈ నెల ఐదో తేదీ వరకు లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభారాణి తెలిపారు.

గంటాకు ఏ పార్టీ టికెట్ ఇవ్వొద్దు

- స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం రాజీనామా.. అంటూ దొంగనాటకాలు
- విశాఖ నవ నిర్మాణ సమితి అధ్యక్షుడు తోట రాజీవ్



మాట్లాడుతున్న తోట రాజీవ్

సీతంపేట: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వంటి కుట్రలు చేసే నాయకుడికి ఏ రాజకీయ పార్టీ రానున్న ఎన్నికల్లో టికెట్ ఇవ్వొద్దని విశాఖ నవ నిర్మాణ సమితి అధ్యక్షుడు తోట రాజీవ్ డిమాండ్ చేశారు. స్థానిక ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. 'గంటా శ్రీనివాసరావు నిరంతరం అధికార పార్టీలోకి వెళ్లడం కోసం ఉన్న పార్టీ లైన్‌కు విరుద్ధంగా ప్రవర్తించారు. మూడు రాజధానులు ముద్దు అని ప్రకటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం ఒక బూటకం. ఇప్పుడు ఆయన నిజస్వరూపం బయటపడింది. నిజంగా విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో చిత్తశుద్ధి ఉంటే సొంత గనుల కేటాయింపు కోసం బీజేపీతో కలిసి అధికారంలో ఉన్నప్పుడు గంటా ఎందుకు ప్రయత్నం చెయ్యలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ మాత్రమే కాకుండా విశాఖ నగర అభివృద్ధికి, నగర నవనిర్మాణం కోసం ఆయన ఏమీ చేయలేదు. ప్రతిసారి కొత్త నియోజకవర్గాన్ని ఎంచుకుని అక్కడ నాయకులను, ఓటర్లను మోసం చేస్తున్న గంటాకు ఈసారి ఏ పార్టీ టికెట్ ఇవ్వకూడదు. గతంలో గంటా శ్రీనివాసరావుపై సిట్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేసి తక్షణమే దానిపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశాఖ నవనిర్మాణ సమితి నాయకులు గొల్లకోట వెంకట సుబ్బారావు, గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

సంస్కరణలపై దృష్టి సారించారు

మహారాణిపేట: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన మధ్యంతర బడ్జెట్‌ను ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ స్వాగతించింది. గురువారం పందిమెట్టలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జనాదరణ పొందిన విధానాలను ఆశ్రయించకుండా ఆర్థిక సంస్కరణలపై దృష్టి సారించి, దీర్ఘకాలిక ప్రయోజనాలతో కూడిన వృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపొందించారన్నారు. ప్రధాని ఆవాస్ యోజన కింద రెండు కోట్ల అదనపు గృహాలు, 40,000 సాధారణ రైల్వే బోగీలను వందే భారత్ ప్రమాణాలకు మార్చడం శుభపరిణామం అని ఆయన అన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఐబీ సిలబస్‌పై హర్షం

విశాఖ విద్య: ప్రభుత్వ స్కూళ్లలో ఐబీ సిలబస్ బోధనకు ఏర్పాట్లు చేస్తుండటం ఎంతో హర్షించదగ్గ విషయమని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. బెంగళూరులో ఇప్పటికే 40 పాఠశాలల్లో ఐబీ సిలబస్ బోధన జరుగుతోందన్నారు. ఎల్‌కేజీకి రూ.5 లక్షల వరకు ఫీజు ఉంటుందని, అలాంటిది ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా ఐబీ సిలబస్‌తో చదువుకునే అవకాశం కల్పిస్తుండటం గొప్ప మార్పు అన్నారు.

నేటి నుంచే క్రికెట్ పండగ

విశాఖలో 1988లో జరిగిన తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ మొదలుకుని.. ఇటీవల జరిగిన టీ–20 మ్యాచ్ వరకు.. ఎన్నెన్నో జ్ఞాపకాలకు విశాఖ క్రీడాభిమాని హృదయం నిలయం. క్రికెట్ గురించి ప్రస్తావిస్తే చాలు మనసు తెర మీద చిటికెలో ప్రత్యక్షమయ్యే అద్భుతాల చిత్రాలు.. ఇక్కడ అభిమానులను అనంతానందాల వెల్లువలో మునకలేయిస్తాయన్నది వైఎస్సార్ స్టేడియం సాక్షిగా తిరుగులేని నిజం. ఈ సంతోషాల పరంపరలో మరో మహత్తర ఘట్టం శుక్రవారం ఆవిష్కృతం కానుంది. సిరీస్‌లో 0–1తో వెనుకబడిన టీమిండియాకు ఈ టెస్ట్ మ్యాచ్ ఎంతో కీలకం. అచ్చొచ్చిన స్టేడియంలో విజయం సాధిస్తే.. చరిత్ర పుటల్లో మరోసారి విశాఖ పేరు లిఖితం కానుంది.

– విశాఖ స్పోర్ట్స్



ప్రాక్టీస్ సెషన్‌లో భారత్ జట్టు సభ్యుల సమాలోచన



నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న యశస్వి జైశ్వాల్



ఫుట్‌బాల్ డ్రిబిల్ చేస్తున్న ఇంగ్లండ్ ఆటగాళ్లు

ఆతిథ్య భారత్ జట్టుకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఫేవరేట్ మైదానం. గతంలో ఇక్కడ జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన భారత్.. ముచ్చటగా మూడో విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేయాలని భావిస్తోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండో టెస్ట్ మ్యాచ్ శుక్రవారం ప్రారంభం కానుంది. గతంలో ఇదే వేదికపై 2016లో తొలిసారిగా ఇంగ్లండ్‌తో భారత్ తలపడి విజయం సాధించింది. 2019లో దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విజేత కేతనం ఎగురవేసింది. ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో భారత్ 0–1తో తొలి టెస్ట్‌ను కోల్పోగా.. రెండో మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా నెట్స్‌లో తీవ్రంగా శ్రమించింది. రెండు రోజుల పాటు ఇరు జట్లు ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాయి. ఆధిక్యాన్ని కొనసాగించేందుకు ఇంగ్లండ్, లెక్క సరిచేసేందుకు భారత్ ప్రణాళికలతో మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. తొలి టెస్ట్‌లో రివర్స్ స్వీప్‌తో ఇంగ్లండ్ జట్టు భారత్ బౌలర్లకు చుక్కలు చూపించి బజ్‌బాల్ ఫార్ములాతో విజయాన్ని సొంతం చేసుకుంది. ఓ వైపు ఫీల్డింగ్ లోపాలతో క్యాచ్‌లు జారవిడవడంతో భారత్ గెలుపునకు చేరువై తొలి టెస్ట్ కోల్పోయింది. గడిచిన రెండు రోజుల్లో ఇలాంటి లోపాలను సరిదిద్దుకుని పూర్తి సంసిద్ధతతో ఉన్నామని జట్టు సభ్యులు చెప్పడంతో విశాఖ మ్యాచ్‌పై అభిమానులు ఆసక్తి పెంచుకున్నారు. విరాట్ కోహ్లి విశాఖ మ్యాచ్‌కు సెలవు తీసుకోగా.. తొలిటెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటర్ కె.ఎల్ రాహుల్, రవీంద్ర జడేజా తొడకండరాలు పట్టేడయంతో ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేరు. వీరి స్థానాల్లో మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్, స్పిన్ ఆల్‌రౌండర్ సౌరభ్ కుమార్‌లతో పాటు బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకున్నారు. వీరంతా విశాఖలో జోరుగా ప్రాక్టీస్ చేశారు. విశాఖ పిచ్ స్పిన్‌కు అనుకూలం కావడంతో గతంలో ఇదే వేదికపై జరిగిన ఇంగ్లండ్–భారత్ టెస్ట్ మ్యాచ్ రెండు రోజులకే ముగిసింది. విశాఖలోని సెంటర్ పిచ్‌లో జరగనున్న ఈ మ్యాచ్ బ్యాటింగ్‌కు అనుకూలించేది అయినా శని, ఆదివారాల్లో స్పిన్‌కు సహకరించే అవకాశం ఉందనేది నిపుణుల అభిప్రాయం. ఇంగ్లండ్ తరఫున షోయబ్ బషీర్ అరంగేట్రం చేయనుండగా హార్ట్‌లీ, రెహాన్‌లు తోడు కానున్నారు. స్పిన్నర్ జాక్‌లీచ్ మోకాలి గాయంతో జట్టుకు దూరమయ్యాడు. భారత్ యువబ్యాటర్లు తొలి టెస్ట్‌లో.. అందునా రెండో ఇన్నింగ్స్‌లో కఠినమైన పరిస్థితులు ఎదుర్కొన్నారు. గతంలో ఇదే వేదికపై రెండు టెస్ట్ సెంచరీలు సాధించిన రోహిత్ ఈ సారి ఓపెనర్ గానే కాక జట్టును సమష్టిగా ముందుకు నడిపించనున్నాడు. వైస్ కెప్టెన్ బుమ్రా ఆది నుంచే ప్రత్యర్థిని ఎలా కట్టడి చేస్తాడనే దానిపైనే అందరిలో ఆసక్తి నెలకొంది. ఇక ఇదే వేదికపై భారత్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ టాస్ గెలిచి.. విజయం సాధించింది. మరికొన్ని గంటల్లో ప్రారంభం కానున్న మ్యాచ్ కోసం అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్ కోసం పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు.

కష్టపడితే విజయం సొంతం

- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్
- క్రికెటర్ భరత్‌కు ఘన సన్మానం



భరత్‌ను సన్మానిస్తున్న సీపీ రవిశంకర్, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: కష్టపడితే విజయం సాధించవచ్చనేందుకు ఉదాహరణే విశాఖ నుంచి అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగిన భరత్ అని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అన్నారు. వైఎస్సార్ స్టేడియంలో గురువారం జరిగిన కె.ఎస్.భరత్ సత్కార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విశాఖ యువత భరత్ సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని రాణించాలని పిలుపునిచ్చారు. భరత్ ఎదుగుదలలో ఏసీఏ తోడ్పాటు, తల్లిదండ్రులు పాత్ర పేర్కొనదగిందన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 2013లో ఏసీఏ తరఫున దేశవాళీ క్రికెట్‌లో రాణించిన భరత్.. ఓ వికెట్ కీపర్ ట్రిపుల్ సెంచరీ చేయడంతో అందరి దృష్టిని ఆకర్షించాడన్నారు. పదేళ్ల పాటు ముస్తాక్ అలీ, విజయ్ హజారే లాంటి ట్రోఫీల్లో చక్కగా రాణించి ఐపీఎల్‌లో సయితం ఆడాడన్నారు. కె.ఎస్.భరత్ మాట్లాడుతూ ఈ స్థాయిలో రాణించడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సొంత పిచ్‌పై టెస్ట్ మ్యాచ్‌కు వికెట్ల వెనుక నిలవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో భరత్ తల్లిదండ్రులు, కోచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ టీడీపీలో అసమ్మతి రాగం

గణబాబుపై పెరుగుతున్న వ్యతిరేకత



గణబాబు వ్యతిరేక వర్గ నాయకుడు యాదవ్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ తెలుగుదేశం ఎమ్మెల్యే గణబాబుపై అసమ్మతి రాగం వినిపిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల జరిగిన ఓ ప్రెస్‌మీట్‌లో గణబాబుపై కొందరు తెలుగుదేశం నేతలు తీవ్ర విమర్శలు చేయగా.. తాజాగా మరికొందరు ఏకమయ్యారు. గోపాలపట్నంలో గురువారం రాత్రి జరిగిన టీడీపీ చోడవరం ఎన్నికల పరిశీలకుడు మూర్తి యాదవ్ జన్మదిన వేడుకలకు వీరంతా హాజరై గణబాబు తీరుపై నిప్పులుకక్కారు. గణబాబు వల్ల తాము పడ్డ ఇబ్బందులు, మానసిన వేదనను వివరించారు. ఎమ్మెల్యే తమను ఏ విధంగా వాడుకుని వదిలేశారో చెప్పుకున్నారు. 20, 30 ఏళ్లుగా పార్టీ కోసం, గణబాబు కుటుంబం గెలుపు కోసం కష్టపడ్డామని తెలిపారు. అయినా తమకు కనీస గుర్తింపు ఇవ్వలేదని బాధపడ్డారు. కష్టమొచ్చిందని వెళ్లినా ప్రతిసారీ నిరాశ ఎదురైందని, ఆయన నుంచి ఏ విధమైన భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మానసికంగా, సామాజికంగా అణగదొక్కారని, కష్టపడేవారికి కనీసం నామినేటెడ్ పోస్టులు ఇప్పించాలని కోరినా పట్టించుకోలేదని వాపోయారు. టీడీపీ నగర ఉపాధ్యక్షుడు పాసర్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 92వ వార్డు కార్పొరేట్ అభ్యర్థి బాల సుబ్రహ్మణ్యం, పెంటకోట త్రినాథ్, మహిళలు బొడ్డేటి ఉమ, రమణమ్మ పాల్గొన్నారు.

సమన్వయంతో 'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం

మహారాణిపేట: విశాఖపట్నం వేదికగా ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రాష్ట్రస్థాయి క్రీడలను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం గురువారం ఆయన చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం బస్, రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. బస్, రైల్వేస్టేషన్ల నుంచి క్రీడాకారులు వసతి గృహాలు, క్రీడా ప్రాంగణాలకు రాకపోకలు సాగించేందుకు రవాణా సదుపాయాలు కల్పించాలన్నారు. మహిళలు, పురుష క్రీడాకారులకు కేటాయించే వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన అల్పాహారం, భోజనాన్ని క్రీడాకారులకు అందించాలని సూచించారు. ఒక్కో క్రీడకు ఒక్కో నోడల్ అధికారిని నియమించి పర్యవేక్షించాలని ఆదేశించారు. క్రీడా మైదానాలను పరిశీలించి అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని స్పష్టం చేశారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీఎస్‌డీఏ జూన్ గాలియట్, ఆర్డీవో భాస్కరరెడ్డి, డీఎస్‌వో సూర్యప్రకాష్, యూసీడీ పీడీ పాపునాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'కూల్ హెల్మెట్'కు ప్రథమ బహుమతి



జ్ఞాపిక అందుకుంటున్న రాజారావు మాస్టారు

విశాఖ విద్య: సౌత్ ఇండియా స్థాయి సైన్సు ఫెస్టివల్‌లో జిల్లా ఉపాధ్యాయుడు ప్రదర్శించిన 'కూల్ హెల్మెట్'కు మొదటి బహుమతి దక్కింది. గంగవరం హైస్కూల్‌లో సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పొలగుమ్మి రాజారావు కూల్ హెల్మెట్‌ను తయారు చేశాడు. ఉపాధ్యాయ కేటగిరీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సైన్సు ఫెయిర్‌లో తన ప్రాజెక్టును ప్రదర్శించి, అందరి ప్రశంసలు అందుకోవడం ద్వారా సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడ కేంద్రంగా జరిగిన సౌత్ ఇండియా స్థాయి సైన్సు ఫెస్టివల్‌లో రాజారావు తయారు చేసిన కూల్ హెల్మెట్‌కు మొదటి బహుమతి పొందింది. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి నుంచి ప్రశంసాపత్రం, మెమెంటో, నగదు పురస్కారాన్ని రాజారావు అందుకున్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

విశాఖలీగల్: మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. జిల్లా కోర్టులో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం గురువారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా విభాగాల పరిధిలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు పంపించాలని, తదుపరి చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇన్సూరెన్స్, రెవెన్యూ, తదితర కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ వేదికగా అత్యధిక కేసులు పరిష్కారానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, రెండో అదనపు జడ్జి ఎం.వెంకటరమణ, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, క్రైమ్ డీసీపీ పి.వెంకటరత్నం, అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఏఎస్పీ కె.ధీరజ్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాంబాబు, జిల్లా కోర్టు సీనియర్ జడ్జిలు, అదనపు జడ్జిలు, న్యాయవాదులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

4,359 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం నగరంలోని 10 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 4,359 మందికి వైద్య సేవలందించగా..13 మందిని వివిధ ఆస్పత్రులకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రిఫర్ చేశారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు నేడు

భీమునిపట్నం: భీమిలి వుడా మైదానంలో శుక్రవారం నుంచి విశాఖ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్– 14 చాంపియన్‌షిప్ పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నామని అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.లలిత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. పోటీల నిర్వహణకు భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్ స్కూల్ సహకారం అందిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయిలో 13 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొంటాయని, వారందరికీ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడలపై పిల్లలకు ఆసక్తి పెంపొందిస్తే మంచి క్రీడాకారులుగా రూపొందుతారని, ఇదే తమ లక్ష్యమన్నారు. పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు, అసోసియేషన్ కార్యదర్శి పి.అరుణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు

మహారాణిపేట: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం ఆయన తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి లోటుపాట్లు ఉన్నా.. వాటిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఆర్వో కె.మోహన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు జారీ చేసిన బిల్డర్‌కు జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన బిల్డర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నగరంలోని ఏడో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలికి రూ.45 లక్షలు చెల్లించాలని అందులో స్పష్టం చేశారు. బాధితురాలి న్యాయవాది కల్యాణ చక్రవర్తి అందించిన వివరాలివీ. ఫిర్యాది నగరంలోని కిర్లంపూడి లే అవుట్ ప్రాంతానికి చెందిన మహతాబ్ ఫరిహాత్ ఖానామ్. ఆమె అంధురాలు. నిందితుడు అడపా నరసింహారావు బిల్డర్. మాధవధార ప్రాంతంలో ఉంటున్నాడు. చినముషిడివాడలో నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కోసం బాధితురాలు రూ.25,43,000లను పలు దఫాలుగా అతనికి చెల్లించారు. ఫిర్యాది ఎన్నిసార్లు కోరినా ఫ్లాట్ ఇవ్వలేదు. సొమ్మును కూడా వాపస్ చేయలేదు. ఈ క్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. బాధితురాలు చెల్లించిన సొమ్ముతోపాటు వడ్డీతో సహా రూ.45 లక్షలు ఆమెకు ఇవ్వడానికి బిల్డర్ అంగీకరించాడు. 2022 ఫిబ్రవరి ఒకటో తేదీన నాలుగు చెక్కులను బాధితురాలికి ఇచ్చాడు. ఆ చెక్కులను ఆమె తన బ్యాంక్ ఖాతాలో వేసినా ప్రయోజనం లేకపోయింది. నిందితుడి ఖాతాలో డబ్బు లేనందున చెక్కులు నిరాదరణకు గురయ్యాయి. దీంతో న్యాయవాది ద్వారా నోటీసు జారీ చేయగా.. బిల్డర్ నుంచి స్పందన రాలేదు. దీంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.45 లక్షలు బాధితురాలికి చెల్లించాలని తీర్పునిచ్చారు. అలాగే రూ.5 వేలను ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని తీర్పులో పేర్కొన్నారు.

రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంఘం ఈసీగా దేవానంద్


విశాఖ లీగల్: రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా వడ్లపాటి దేవానందరావు ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం 12వ అదనపు జిల్లా కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. 2022 సెప్టెంబర్ 12న ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా ఇద్దరు యువకులను లైఫ్ గార్డ్స్ కాపాడారు. బిహార్‌కు చెందిన 9 మంది యువకులు గురువారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులంతా సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో వీరిలో అసద్ (28), సోహిల్ (30) కొట్టుకుని పోతుండగా... అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ చందు, సూరాడ నూకరాజు, డి.కార్తీక్, ఎం.అమ్మోరు, సతీష్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. యువకులకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

పరీక్షా సమయం

- నేడు ఇంటర్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష
- 3న జరగాల్సిన ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష 23కు వాయిదా
- ఈ నెల 5 నుంచి ప్రాక్టికల్స్, మార్చి 1 నుంచి వార్షిక పరీక్షలు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 82,756 మంది విద్యార్థులు
- ఫస్టియర్ 40,873 మంది, సెకండ్ ఇయర్ 41,883 మంది
- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ మల్లికార్జున



ప్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని గుర్తింపు ఉన్న కాలేజీలన్నింటిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది. ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష షెడ్యూల్ మేరకు ఈ నెల 3న జరగాల్సి ఉండగా, దీనిని ఈ నెల 23న నిర్వహించేలా ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకనుగుణంగా జిల్లాలోని అన్ని కాలేజీల నిర్వాహకులను జిల్లా అధికారులు అప్రమత్తం చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 173 కాలేజీల్లో గల 82,756 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

కేంద్రాలకు చేరిన సామగ్రి

పరీక్షల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఇప్పటికే జిల్లాలోని అన్ని కాలేజీలకు సరఫరా చేశారు. పరీక్ష ప్రారంభ సమయానికి పావు గంట ముందు ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్ల మెయిల్స్‌కు ప్రశ్నాపత్రాన్ని నేరుగా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు పంపించేలా ఏర్పాట్లు చేశారు. ప్రిన్సిపాల్ సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని, పరీక్షలను నిర్వహించేలా సర్వం సిద్ధం చేశారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున గురువారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించారు.

ఈ నెల 5 నుంచి ప్రాక్టికల్స్

ఈ నెల 5 నుంచి ఇంటర్మీడియెట్ ఒకేషనల్ విద్యార్థులకు, 11 నుంచి జనరల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఎంపీసీ 32,980 మంది, బైపీసీ 4,945 మంది, ఒకేషనల్ 3,268 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జనరల్ కోర్సు విద్యార్థులకు 150, ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు 15 కేంద్రాలను ఎంపిక చేశారు. మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నందున ఈలోగానే ప్రాక్టికల్స్ పూర్తి చేసేలా ప్రతీ రోజూ ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులుగా విభజించి పరీక్షల షెడ్యూల్ ప్రకటించారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నందున అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

పక్కాగా పర్యవేక్షణ



ఎథిక్స్, ఎన్విరాన్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షల నిర్వహణలో కాలేజీల ప్రిన్సిపాళ్లు తగిన బాధ్యత తీసుకోవాలి. ఎలాంటి పొరపాట్లు జరిగినా, ఉపేక్షించేది లేదు. ప్రాక్టికల్స్ పరీక్షలకు కాలేజీల్లో అంతా సిద్ధం చేసుకోవాలి.

– బి.రాధ, డీవీఈవో, విశాఖ జిల్లా

గ్యాస్ సిలిండర్‌పై అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

విశాఖ సిటీ: గ్యాస్ సిలిండర్‌పై వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. వంటకు వినియోగించే గ్యాస్ సిలిండర్ బిల్లులో ఉన్న మొత్తం కంటే అధికంగా వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎల్‌పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు గానీ, డెలివరీ బాయ్స్ గాని బిల్లులో ఉన్న మొత్తం కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే సదరు గ్యాస్ ఏజెన్సీ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తే వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1967/18002333555కు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్‌లోని గ్యాస్ బరువుపై అనుమానం ఉంటే డెలివరీ బాయ్ వద్ద ఉన్న తూకం పరికరం ద్వారా సరిచూసుకునే హక్కు వినియోగదారులకు ఉందన్నారు.